క్లుప్తంగా

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం సభ్యులు

చీడికాడ: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా లెక్కల ప్రసాదరావు, అధ్యక్షుడిగా జీ.పి.ఎ.నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఫణికుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సమస్యలపై నిత్యం పోరాటం చేస్తామని కొత్త కార్యవర్గ సభ్యులు తెలిపారు.

గీత కార్మికులకు బీసీ కార్పొరేషన్ రుణాలివ్వాలి


రీసర్వే డీటీ త్రిమూర్తులకు వినతిపత్రం అందిస్తున్న గీత కార్మికులు

కె.కోటపాడు : కల్లుగీత కార్మికులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రా దేముడు కోరారు. కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయంలో కల్లుగీత కార్మికుల సమస్యలపై బుధవారం రీసర్వే డీటీ త్రిమూర్తులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యర్రా దేముడు మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చ లవిడిగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నా పోలీసు లు, ఎక్సైజ్ పోలీసులు పట్టించుకున్న దాఖలా లు లేవన్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణతో కల్లుగీత కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. తక్షణం బెల్ట్ షాపులను నివారించాలన్నారు.

బ్రిటిష్ సమాధుల స్థలంలో నిర్మాణాలపై ఆందోళన


ధర్నా చేస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

నర్సీపట్నం: చారిత్రక బ్రిటిష్ సమాధుల స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ బ్రిటిష్ అధికారుల సమాధుల స్థలంలో వారం రోజులుగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని విన్నవించుకుంటున్నా ఆర్డీవో గానీ, మున్సిపల్ అధికారులు గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి పట్టణంలో జరుగుతున్న ఆక్రమణలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్టడీ సర్కిల్ లేక విద్యార్థులు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు పేరుతో ఈ స్థలంలో స్టడీ సర్కిల్ భవనం నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.వి.సూర్యప్రభ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సాపిరెడ్డి నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు యూరియా అందజేత


ఎ.కోడూరు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

కె.కోటపాడు : రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది చేసే సాగు సూచనలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చునని సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు అన్నారు. ఎ.కోడూరు రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రైతులకు రాయితీ ధరపై యూరియా ను వ్యవసాయశాఖ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్, ఎంపీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం వ్యవసాయ శాఖ సహాయకుడు అప్పలనాయుడు మాట్లాడుతూ ఎ.కోడూరు రైతు సేవా కేంద్రానికి 12 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. బస్తా ధర రూ.270 చొప్పున రైతులకు విక్రయించనున్నట్టు చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రావికమతం: మేజర్ పంచాయతీ కొత్తకోట అరుంధతి కాలనీలో వైస్ సర్పంచ్ పందల దేవా, పంచాయతీ ఈవో జ్యోతి ఈశ్వరరెడ్డి బుధవారం పర్యటించారు. కాలనీలో తాగునీటి సమస్య ఉందని, పరిష్కారానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు వారు స్పందించి త్వరగా తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.


వైఎస్ జగన్ ప్రభుత్వం రాక ముందు చంద్రయ్యపాలెం పరిస్థితి


ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలతో చంద్రయ్యపాలెం


జగనన్న ఇళ్లతో పక్కా భవనం నిర్మాణం చేసుకున్న గిరిజనుడు

జగనన్నతో నెరవేరిన సొంతింటి కల

- వైఎస్సార్‌సీపీ హయాంలో మారిన చంద్రయ్యపాలెం స్వరూపం
- నాడు పూరిళ్లు-నేడు పక్కా గృహాలు • హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

గొలుగొండ: చుట్టూ దట్టమైన కొండల నడుమ పోడు వ్యవసాయం, కట్టెలు అమ్ముకొని జీవనం సాగించడమే వారికి తెలుసు. ఒక్కరికి కూడా సెంటు భూమి లేని దుస్థితి. పూరిళ్లు తప్ప ఆ గ్రామంలో కనీసం పెంకుటిళ్లయినా కానరాని పరిస్థితి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పాతమల్లంపేట పంచాయతీ శివారు గిరిజన గ్రామం చంద్రయ్యపాలెం స్వరూపమే మారిపోయింది. గ్రామంలో 17 కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కా స్లాబ్ ఇళ్లు మంజూరు చేసింది. కొందరు ఇళ్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేయగా.. మరికొందరి ఇళ్లు తుది దశకు చేరుకున్నాయి. వైఎస్ జగన్ వల్లే తమకు సొంతిల్లు సాధ్యమైందని గిరిజను ఎంతో సంతోషంగా చెబుతున్నారు.

పాత మల్లంపేట పంచాయతీ శివారు గిరిజన గ్రామం చంద్రయ్యపాలెంలో 17 కుటుంబాలు గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఈ గ్రామంలో చిన్న పాటి పూరిళ్లలో ఆయా కుటుంబాలు తలదాచుకునేవి. గట్టిగా వర్షం కురిస్తే తాటాకు ఇళ్లు కారిపోయేవి. దీనికి తోడు కొండ అంచున ఉండడంతో వరద నీరు ముంచెత్తడంతో పాటు పాములు గ్రామంలోకి వచ్చి హల్‌చల్ చేసేవి. 2019 జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత నవరత్న పథకాలు అందడంతో కాస్త ఇబ్బందులను నుంచి బయటపడ్డారు. తరువాత 2022-23లో జగనన్న గృహ పథకంతో గిరిజన జీవన విధానంలో పూర్తిగా మార్పు వచ్చింది.

ఐక్యతతో నిరాకరణ

17 కుటుంబాలు జీవనం సాగించే ఈ గ్రామంలో గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో గ్రామానికి రెండు, మూడు ఇళ్లు మాత్రమే మంజూరు చేసేవారు. దీంతో గిరిజన ప్రజల్లో ఐక్యత వల్ల ఈ మూడు ఇళ్లు ఎవరు కట్టుకున్న మిగతావారు ఇబ్బందులు పడుతున్నట్లు భావించి నిరాకరించే వారు. దీంతో ఈ గ్రామంలో పక్కా ఇళ్లు అనేవి లేకుండా పోయాయి. అయితే వైఎస్సార్‌సీపీ హయాంల అన్ని గ్రామాల్లో చకచక జగనన్న కాలనీల నిర్మాణం జరుగుతున్న సమయంలో స్థానిక నాయకులు ఈ గ్రామ సమస్యను మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే గృహ నిర్మాణ అధికారులు పర్యవేక్షణ చేశారు. **గ్రామంలో ఎంత మంది ఉంటే అందరికీ ఇళ్లు మంజూరు చేయడంతో 17 కుటుంబాలు** ఒక్కసారిగా ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టారు. అలా జగనన్న కాలనీతో గిరిజనుల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది.

ఇప్పటికి 90 శాతం పూర్తి

2022-23 ఇళ్లు మంజూరు కావడంతో గిరిజన ప్రజలు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. అప్పటి జగనన్న ప్రభుత్వం ఇచ్చిన రూ1.80 లక్షలతో పనులు ప్రారంభించి, అంచెలంచెలుగా పూర్తి చేసుకున్నారు. ఈ గ్రామానికి ఎవరైన కొత్తవారు వెళ్లే ప్రస్తుతం గ్రామాన్ని చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఈ కాలనీలో ఇప్పటికి 90 శాతం పనులు పూర్తయ్యాయి.

జగన్ దయ వల్లనే..



జగన్ ప్రభుత్వంలో అందరికీ ఇళ్లు మంజూరయ్యాయి. అప్పట్లో రూ.1.80 లక్షలు ఇచ్చారు. స్లాబ్ వేసిన తరువాత దశల వారీగా ఇంటి నిర్మాణం పూర్తి చేశా. మా గ్రామంలో ఇప్పుడు పూరిళ్లు అనేవి లేవు. పక్కా ఇళ్ల నిర్మాణం చేసుకోవడంతో అందరూ ఎంతో ఆనందంగా ఉన్నారు. – దారబాబు, చంద్రయ్యపాలెం

జగనన్నకు రుణపడి ఉంటాం..



మా గ్రామం తాటాకు ఇళ్లతోనే ఉండిపోతుందేమోనని అనుకున్నాం. మాజీ సీఎం వైఎస్ జగన్ దయతో ఊరందరికీ ఇళ్లు మంజూరు కావడం మరువలేనిది. తలదాచుకోవడానికి గూడు సదుపాయం కల్పించిన జగనన్నకు మా గ్రామం జీవితాంతం రుణపడి ఉంటుంది.

– లక్ష్మమ్మ, చంద్రయ్యపాలెం

ఆటో కార్మికుల సమస్యలపై 4న ధర్నా


ధర్నా కరపత్రాలను ఆటోడ్రైవర్లకు అందిస్తున్న దొరబాబు, కాసుబాబు

కె.కోటపాడు : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర పథకంను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్ల సమస్యలపై వచ్చేనెల 4న అనకాపల్లిలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ధర్నా కరపత్రాలను కె.కోటపాడు, ఎ.కోడూరు, చౌడువాడ గ్రామాల్లోని **ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లతో కలిసి బుధవారం** ఆయన **ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొరబాబు** మాట్లాడుతూ **ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు** చొప్పున **అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ** పథకం **అమలుకు నోచుకోలేదన్నారు. మరోవైపు పో**లీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.దేముడునాయుడు, వేచలపు కాసుబాబు, రెడ్డి అప్పలనాయుడు, పొంతపల్లి రామారావు, ఆటో యూనియన్ అధ్యక్షుడు వెంకటరావు, ఇల్లాకు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు


ఎం.కోటపాడులో కిసాన్ డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

మాడుగుల రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతు**లో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి** అన్నారు. **సత్యవరం గ్రామానికి చెందిన రైతు గ్రూపునకు సబ్సిడీపై మంజూరైన కిసాన్ డ్రోన్‌ను ఎం.కోటపాడులో బుధవారం ఆయన ప్రారంభించారు.** మండల **వ్యవసాయాధికారి ఎం.అనసూయ** అధ్యక్షతన **జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే** మాట్లాడుతూ **వ్యవసాయ యంత్ర పరికరాలను** రైతులు **సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవో** మాట్లాడుతూ పురుగు మందు స్ప్రేయింగ్ నిమిత్తం డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు కాగా, 80 శాతం సబ్సిడీ పోగా, రైతు 20 శాతం మేర అంటే రూ.1.96 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, స్థానిక నాయకుడు మజ్జి లక్ష్మణరావు, గాదిరాయి, సత్యవరం, గ్రామాల సర్పంచ్‌లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు


సమావేశంలో పాల్గొన్న వీఆర్పీలు, సామాజిక తనిఖీ బృంద సభ్యులు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గురువారం నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు సోషల్ ఆడిట్ సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, వీఆర్పీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 35 పంచాయతీల్లో ఏడాది కాలంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకం పనులు నాణ్యతగా జరిగాయా? లేదా? కూలీలకు వేతనాలు సంక్రమంగా అందాయా? లేదా? అని సోషల్ ఆడిట్ బృంద సభ్యులు తనిఖీలు చేస్తారన్నారు. ఏడాది కాలంలో మండలంలో 27.28 కోట్ల రూపాయలతో జరిగిన 1,604 పనులుపై, పింఛన్‌లపై తనిఖీలు చేస్తారని చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరహాలబాబు, ఇంజినీరింగ్ సిబ్బంది, టీఏలు, వీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నూకరాజు మృతికి సంతాపం


నూకరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్


మాజీ సర్పంచ్ నూకరాజు(ఫైల్)

నాతవరం: ఎం.బెన్నవరం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తమరాన నూకరాజు(89) బుధవారం అనారోగ్యంతో మరణించారు. స్వగ్రామమైన ములగపూడిలో నూకరాజు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకరాజు నైతిక విలువులతో కూడిన రాజకీయం చేశారన్నారు. శ్రీమాదాలమ్మ తల్లి ఆలయానికి ఒక ఎకరం భూమి దానమిచ్చా రని గుర్తు చేశారు. నూకరాజు మరణం పార్టీకి తీరని లోటున్నారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు ఇట్టంశెట్టి గోవిందరావు, పంచాయతీ సర్పంచ్ మార్తి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు లోకవరపు బంగారం, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. మండల పరిషత్ మీటింగ్ హాలులో ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

వడ్డాది కాలేజీలో కొత్త కోర్సులు ప్రారంభం

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ ఏడాది నుంచి ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ జి.చిన్నారావు తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ కోర్స్, ఈఈటీ కోర్స్‌లు రెండు ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ కోర్స్‌లకు ఏడాది ప్రవేశ ఫీజు కింద రూ.2,684 చెల్లించి విద్యార్థులు ప్రవేశం పొందాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు కాలేజీలో సంప్రదించాలని కోరారు.

కొత్తకోట కళాశాలలో మిగుల సీట్ల భర్తీకి ఆహ్వానం

రావికమతం: మండలంలో కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి బుధవారం తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు గతేడాది కంటే పెరిగాయని చెప్పారు. మిగుల సీట్ల భర్తీ కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు ఘన సత్కారం


దేవరాపల్లిలో బదిలీపై వెళ్లిన వ్యవసాయ సిబ్బందిని సత్కరిస్తున్న ఏవో కాంతమ్మ, ఏఈవో కిరణ్‌కుమార్

దేవరాపల్లి: మండలంలో విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వ్యవసాయశాఖ సిబ్బంది(అగ్రికల్చర్ అసిస్టెంట్లు)ను ఘనంగా సత్కరించారు. దేవరాపల్లిలోని రైతు సేవా కేంద్రం-2లో బదిలీ అయిన కె.సత్యారావు, డి.వరుణ్, రామానాయుడు, జనార్దన్, రాంబాబు, స్వప్న, సత్య ప్రసాద్, భాగ్య తదిరులను బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ, విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్ సత్కరించి వారి సేవలను కొనియాడారు.


కొరువాడ పశు వైద్యాధికారి నాయుడును సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కె.కోటపాడు : ఆరేళ్ల పాటు కొరువాడ పశువైద్యాధికారిగా పని చేసిన ఇటీవల బదిలీ అయిన సిహెచ్.వై.నాయుడును సర్పంచ్ సింగంపల్లి నారాయణ మూర్తి, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, పీఏసీఎస్ చైర్మన్ చీపురపల్లి రామారావు బుధవారం సన్మానించారు. చౌడువాడకు బదిలీ అయిన ఆయనను కొరువాడ సచివాలయంలో సన్మానం చేసి, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ అక్కునాయుడు, యడ్ల శ్రీను, వేచలపు రామమూర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలి


మాట్లాడుతున్న గొలుగొండ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ

నాతవరం: కొత్తగా వచ్చిన నిబంధనలు మేరకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడాలని ఐసీడీఎస్ గొలుగొండ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ అన్నారు. మండల కేంద్రం నాతవరంలో బుధవారం సెక్టారు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పని తీరులో మార్పు కన్పించేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. చిన్నారులను అన్ని విధాలుగా తీర్చిదిద్దడంతో పాటు ఆరోగ్యపరమైన విషయాల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డొంకాడకు రోడ్డు వేయాలని గిరిజనుల ధర్నా


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు, గిరిజన సంఘ నాయకులు

నర్సీపట్నం: డొంకాడ గ్రామానికి రోడ్డు వేయాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు పరిష్కారం కోసం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఐఏఎస్ అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. డొంకాడ గ్రామానికి రోడ్డు వేసేందుకు రూ.1.60 కోట్లు 2023లో మంజూరుతో పాటు ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా ఇచ్చారన్నారు. కలెక్టర్ ప్రొసిడింగ్ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభించలేదని పీఆర్ అధికారులు చెబుతున్నారన్నారు. తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. రోలుగుంట మండలం, పనసలపాడు రెవెన్యూ పరిధి సర్వే నంబరు 8/1లో మాజీ సర్పంచ్‌కు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలన్నారు. ఆర్ల గ్రామం నుంచి పిత్రిగడ్డ వరకు రూ.4.10 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను మధ్యలో వదిలేశారన్నారు. వైబీ పట్నం నుంచి లోసింగి, పెద్దగరువు రూ.2.60 కోట్లతో రోడ్డు వేసి, కల్వర్టులు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, డొంకాడ గ్రామస్తులు కొండతాంబిల్లి అప్పారావు, గిరిజన సంఘం నాయకుడు చీపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎం.కోటపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా నాయుడు ప్రమాణ స్వీకారం

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోటపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా పిళ్లా నాయుడు బుధవారం ప్రమాణ స్వీకా రం చేశారు. జనసేన పార్టీకి చెందిన నాయుడు చైర్మన్‌గా, డైరెక్టర్లుగా ఆడపా రాజుబాబు, గెంజి కొండలరావు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, సంఘ సీఈవో బొడ్డేడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా శాఖలో 5జీ సేవలు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం విద్యా శాఖ కార్యాలయంలో ఇంటర్నెట్‌కి సంబంధించిన రూటర్స్ అప్‌డేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రాష్ట్రస్థాయి అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న 4జీ సేవలకు బదులుగా 5జీ సిమ్‌లను ఇచ్చి వాటిని అప్‌డేట్ చేశారు. అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడానికి చర్యలు తీసుకున్నట్టు డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.ఎ స్.ఎస్.మూర్తి, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.